రామకృష్ణ ఆఫీసునుండి ఇంటికివచ్చాక ఇల్లంతా కొత్తగా శూన్యంగా కనబడింది. రోజూ తుమ్మెదలా ఎప్పుడూ పనిలో మునిగివుండేజానకి కనపడలేదా వేళ అతనికి. అటువస్తువులు ఇటూ, ఇటువస్తువులు అటూ నిత్యాసర్దుతూ, కొంచెంమాసిన చీరకట్టుకుని అజాగ్రతలో పమిటకొంచెం తొలపోగా ఎంతో అందాన్ని వెదజల్లే ఆమె వక్షస్థలం రేగిన ముంగురులుకల ఆమెముఖం, కనుపించకపోవటంతో రామకృష్ణకు ఏమీతోచక పిచ్చెత్తినట్టుంది. జానకికోసం ఇల్లంతా వెతికి వెతికి వేసారిపోయాడు. తోటలో మల్లెపందిరి దగ్గిర జాజిపందిరిదగ్గిర వెతికాడు. కానిజానకిని చూడలేకపోయాడు. ఆఖరికి పడకగదిలో వుంటుందని నిశ్చయించుకుని, మేడమీదికి వెళ్లాడు. అక్కడ జానకి ఒకపక్కకి ఒత్తిగిలి పడుకునివుంది. ఒక క్షణంసేపు ఆమెనుచూసి ఆశ్చర్యపడి మాట్లాడలేక పోయాడు రామకృష్ణ.

'జానకీ ఎంతోచలాకీగా వుండేదానివి ఇవాళ బద్ధకంగా పరుండిపోయావేం. ఒంట్లోబాగా లేదా' అని మెల్లిగా అడిగాడు రామకృష్ణ.

ఆమె నిశ్శబ్దాన్ని కోరింది -

"చెప్పుజానకీ, నాతోచెప్పవూ, ఎందుకో?" అంటూ ఆమెవంటిమీద చేయి వేసాడోలేదో, చర్రునలేచి జానకి 'నాతోమీకు అవసరంలేదు వెళ్ళండి. త్వరగా ఇక్కడినుండి వెళ్ళిపొండి - నన్ను ఒంటరిగా వుండనివ్వండి' అన్నది. ఆక్రోశంరంతో, కోపావేశంతో -

ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, రామకృష్ణమెదడు, విఫలమైంది.

'కోపమెందుకుజానకీ నిన్నెప్పుడైనా, ఏమైనా పల్లెత్తుమాట అన్నానా. కారణమేమిటో చెప్పరాదూ నేసర్దుకుంటాగా' అన్నాడు జాలికలిగేటట్లు బ్రతిమాలుతూ.

పక్కనవున్న నీలం కవరును అతని మీదకు విసరివేస్తూ, "ఏమీ తెలీనట్టు నటించకండి- ఇప్పటికైనా మీకే తెలుస్తుంది" అన్నది మళ్ళీముఖాన్ని అటుతిప్పి పడుకుంటూ -

ఉత్తరం చదువుకుంటున్నాడు రామకృష్ణ.

ప్రియమైన రామకృష్ణకు-

నాకు ప్రతివారమూ వుత్తరాలు రాస్తుంటానని మాటయిచ్చి ఎప్పుడోగాని వుత్తరాలు రాయటంలేదు. నేనే వస్తున్నాను మీవూరు లేపు. అక్కడ కొంచెంపనివుంది. పని ఐపోయేదాకా ఒకవారం రోజుఉంటాను. కులాసాఅని తలుస్తాను.

ఎప్పుడూ నిన్నుప్రేమించే
కమల.

ఉత్తరాన్ని యథాప్రకారంగా అతనివేళ్ళు మడిచి కవరులోపెట్టినా.

'గట్టిచిక్కువచ్చి పడ్డది' అనుకున్నాడు మనస్సులో రామకృష్ణ.

'అసలువిషయం అప్పుడే చెప్పేద్దామనుకున్నాడు. కాని, జానకిని ఆశ్చర్యపర్చాలనుకున్నాడు.

'జానకీ నీకే తెలుస్తుంది లేవు ఈ విషయం- నువ్వు నాప్రవర్తనను శంకించావుగదూ' అని శాంతంగా జవాబిచ్చి మెల్లిగావెళ్లిపోయాడు అక్కడ్నుంచి.

నిజానికి జానకికి నమ్మకంలేకపోలేదు రామకృష్ణపై- కాని ప్రత్యక్షంగా తనుచూసిన ఈ ఉత్తరమోమరి! — 'ఏమో మగవాళ్ళను ఎవరు నమ్మగలరు- ఎప్పుడూ ఎక్కడెక్కడో తిరిగి వస్తుంటారు' అనుకుంది జానకిమళ్లీ. అయినాతనతోఎప్పుడైనా చెప్పాడా రామకృష్ణ తనకు ఇలాంటి స్నేహితులున్నారని. తప్పుచేయని వాడయితే తనతో చెప్పటానికి ఎందుకంక బెరుకు. మళ్లాజానకి ఆలోచించింది. "ఔను అడస్నేహితులుండటంలో తప్పేముంది. తను చిన్నప్పుడు ఎంతస్నేహంగా వుండేది పక్కింటి వాళ్ళబ్బాయితో- అలాగేకాకూడదా రామకృష్ణ విషయంలో

ఇలాఅనుకుని కొంచెం పశ్చాత్తాపం చెందింది. మళ్లాకోపం మరచిపోయి రామకృష్ణను మామూలుగానే పలకరిద్దా మనుకుంది. కాని తనఆత్మాభిమానం వద్దని రెండోవైపుకు లాగుతుంది.

సాధారణంగా ఆడవాళ్ళకు కోపంవస్తే తమలోతాము అణచిపెట్టుకుని మనస్సును బాధపెట్టుకుంటారు. ధైర్యంగా నువ్వితప్పపని నామనస్సుని నొప్పించేపని చేస్తున్నావు కనుక నువ్వు ఇక అలా ప్రవర్తించగూడదు అని తేల్చి చెప్పరు. వాళ్ళముఖ కవళికలనుబట్టి మగవాళ్లే మార్చుకోవాలి- కొంచెం తెలివయిన వాళ్ళయితే.

జానకికూడ అందరిలాంటి స్త్రీయే అయినా కొంచెం ధైర్యంచేసి తన కోపకారణం తెలియచేసింది తెలివికలది కనుక. తనకోపానికి కారణం అధార రహితంగాలేదు. అందువల్ల తనప్రవర్తనను యథావుచేసుకునే బాధ్యత రామకృష్ణపైనే వుంది.

ఆరోజు తనుచేయవలసిన పనులన్నీ చేసేసి ఆహారం తీసుకుని నిద్రించడానికి వెళ్లింది మేడమీదికి జానకి. ఆరాత్రి ఎలాగో గడిపేశాడు రామకృష్ణ సూర్యుడి అరుణకిరణాలు మీదపడగానే త్రుళ్లిపడిలేచాడు. జానకివైపు చూశాడు.

ఆమె ఇంకా నిద్రిస్తూనేవుంది. నిద్రలోకూడా ఆమెకనుబొమలు ముడుచుకునేవుంది. నిద్రలో అజాగ్రతవల్ల జారిపోయిన ఆమె పమిటను గాలివల్ల ఆమె ముఖంమీద నాట్యంచేసే ముంగురుల్ని, ఆమె అమాయికమైన ముఖాన్ని చూడగానే జాలివేసింది రామకృష్ణకు. వెంటనే పక్క మీదినుంచి లేచి కాఫీ తయారుచేయడం ప్రారంభించాడు.

వెచ్చటి కరస్పర్శ తగలంగానే వులిక్కిపడి లేచింది జానకి. అనుకోకుండానే ఒక భరతనాట్యపు భంగిమవెట్టింది.

" నేను జానకీ! కాఫీతయారయింది లేవవూ! అన్నాడు లాలనగా ట్రేలో కాఫీ పట్టుకుని.

ఈ దృశ్యం చూడంగానే ఎంత కఠిన హృదయమైన స్త్రీ అయినా భర్త లక్షతప్పుల్ని క్షమిస్తుంది. ఇక మృదువైన హృదయంగల జానకి విషయం చెప్పాలా.

అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో గిర్రున నీళ్లు తిరిగినై ఏస్త్రీకూడా భర్తతనకోసం కష్టపడటం సహించలేదు,

'మీరెందుకు చేశారు కాఫీ' అన్నది హృదయంలో ఆరాటం ఎక్కువై దాదాపు ఏడుస్తూ.

" నేను స్వార్థపరుణ్ణి జానకీ. నీ కోమలమైన శరీరాన్ని కష్టపెట్టి ఎంతపని చేయిస్తున్నాను నీ చేత- ఇకనుంచి నే నేచేస్తాను కాఫీ" అన్నాడు పశ్చాత్తాపంతో, ట్రేటే దగ్గిరవున్న బల్లమీద పెడుతూ.

ఈసారి జానకిఏడుపు ఆపుకోలేక పోయింది. ఎక్కెక్కిఏడుస్తూ 'నేను పాపాత్మురాల్ని మీ హృదయం తెలుసుకోలేక పోయాను నన్నుక్షమించండి' అంటూఅతన్ని కౌగలించుకుని ఏడుస్తోంది.

'లేదుజానకీ ఏడవకు- నేను పాపాత్ముడ్ని, నీ హృదయం గాయపరిచాను.' అన్నాడు మళ్ళా ఆమెను ఊరడిస్తూ. 'ఇంకెప్పుడూ మమ్మల్ని ఏమీఅనను. మీరేపనీచేయొద్దు అన్నీ నేనేచేస్తాను. అన్నది కొంచెం తనను సర్దుకుంటూ,

సరే, ఇదేసమయం అనుకున్నాడు రామకృష్ణ.

జానకి కాఫీ రెండుగుక్కల్లోతాగేసి, కప్పు బల్లమీద ట్రేలో పెట్టింది: అప్పుడే ఇంట్లో అడుగుపెట్టిన బంధువు గాని, లేక మరెవరేనా గాని ఆ సన్నివేశంలో జానకినిచూసి, 'పాపం జానకికి ఒంట్లో బాగాలేదులావుంది' అనుకుంటారేగాని భర్తమీదఅలిగి మంచమెక్కిందని ఎంతమాత్రం అనుకోరు. మరిఇప్పుడుజానకి ముఖంఅట్లాగేవుంది. కంచుకాకడాపెట్టి పెలికినా కోపం అన్న అక్షరంముక్క ముఖంలో కనపడదు. సరే, అసలు విషయం చెప్పాలనుకున్నాడు రామకృష్ణ,

" ఐతే చెప్పమంటావా?" అన్నాడు,

'ఏవిటీ?'

" ఆ ఉత్తరంమాట "

" వొద్దు "

" వొద్దూ? మరి ఎంత రాద్ధాంతచేసి, తీరా చెప్పొద్దంటా వేవిటీ!

'ఐతే ఇంతకీ నాదేఅన్నమాట తప్పంతా! '

" నీదీకాదు, నాదీకాదు అవుత్తరం రాసిన వాడిది "

" ఉత్తరం రాసినవాడా! "

" ఔను. వాడే. వాడీమధ్యకథలు రాయటం మొదలెట్టాడు. పైగా పేరుకూడా మార్చేసుకున్నాడు. అందులో అడపేరూ. ఆఅడపేరేఇంత పనిచేసింది "

ఆశ్చర్యాని కళ్ళార చూడాలనుకున్నాడు రామకృష్ణ.

అలా అనుకున్నట్లే అక్షరాలా ఆశ్చర్యపడిపోయింది జానకి.